క్లుప్తంగా

ఆర్థికసాయం



చిట్యాల : మండల కేంద్రానికి చెందిన పిట్టల రాజు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో అతడితో చదువుకున్న పదో తరగతి 2000 బ్యాచ్‌కి చెందిన మిత్రులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి పిల్లల పేరుపై రూ.65వేలు నగదు ఫిక్స్ డిపాజిట్ చేసి బాండ్ పేపర్‌ను అందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో బోళ్ల రాజేందర్, పోతుగంటి శ్రీధర్, చిలుముల రాజేందర్, జెట్టి కుమారస్వామి, దూడం సతీష్, బాబు, గుర్రం తిరుపతి, ఉప్పుల కిరణ్, గుర్రం శంకర్, కొలుగూరి రాజేందర్, ఆరెపల్లి రామ్, లక్ష్మణ్, సరిగొమ్ముల రాజేందర్, పర్లపల్లి కుమార్ ఉన్నారు.

మల్హర్‌రావుకు నివాళి



మల్హర్ : దివంగత నేత, మాజీ ఎంపీపీ మల్హర్‌రావు వర్ధంతిని బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కొయ్యూరు సెంటర్‌లో మల్హర్‌రావు విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. నూతన గ్రామాలను నెలకొల్పి వాటికి విద్యుత్ సౌకర్యం అందించడంలో ఆయన కృషిని మరువ లేనిదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు జాగరి హరీష్, మండల మహిళా అధ్యక్షురాలు పంతకాని చంద్రకళ, నాయకులు తాజుద్దీన్, వాల యాదగిరిరావు, శ్రీనివాస్, సమ్మయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'మొరం దందాను నిలిపేయాలి'

చిట్యాల : మండల వ్యాప్తంగా సాగుతున్న అక్రమ మొరం దందాను అధికారులు నిలిపేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేష్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో జోరుగా అక్రమ మొరం దందాను కొనసాగిస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోకుండా ఉండడం ఏంటని అయన ప్రశ్నించారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి అక్రమ మొరం తవ్వకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

ఇద్దరికి గాయాలు

చిట్యాల : ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని భీష్మనగర్ శివారు ఎస్సారెస్పీ కాల్వ వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గణపురం మండలం మైలారం గ్రామానికి చెందిన దాసారపు భద్రయ్య (50), ముత్యాల సంపత్ (35) టేకుమట్ల మండలానికి సొంత పనుల నిమిత్తం వెళ్లి చిట్యాల నుంచి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కాల్వ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. దీంతో భద్రయ్య తలకు తీవ్ర గాయంకావడంతో ముక్కు, చెవుల నుంచి రక్తస్రావం అయింది. అలాగే సంపత్‌కు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. దీంతో పైలెట్ కట్కూరి శ్రీనివాస్, ముగల రాజులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. కాగా దాసారపు భద్రయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

పత్తిసాగుకు రైతుల మొగ్గు

- మద్దతు ధర పెంపుతో ఉత్సాహం
- ముందస్తు వానలతో విత్తనాలు నాటుతున్న రైతులు

రేగొండ : మండలంలోని రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రతి ఏటా వానాకాలం సీజన్‌లో ప్రధాన పంటలుగా పత్తి, వరి, ఇతర పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. ఈ ఏడాది ముందే వర్షాలు కురుస్తుండటంతో పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. రెండు, మూడేళ్ల నుంచి నష్టపోతున్న లాభాలు వస్తాయన్న నమ్మకంతో పాటు ఈసారి పత్తిపంటకు మద్దతు ధర పెంచడంతో రైతులు పత్తి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే రైతులు పత్తి విత్తనాలు నాటుతున్నారు.

ప్రధాన పంటగా కాటన్..

మండలంలో అధిక విస్తీర్ణంలో పత్తి పంటను సాగు చేస్తున్నారు. పత్తి సాగులో వరుస నష్టాలు ఉన్నప్పటికీ అన్నదాతలు తమ ఆశలను వదులుకోవడం లేదు. తెగుళ్లకు మందులు, ఎరువులు, కూలీల ఖర్చుకు తోడు వర్షాలకు పంట దెబ్బ తినడం వంటి కారణాలతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. పెసర, మినుము ఇతర చిన్న పంటలు సాగు చేయడం వల్ల పెద్దగా లాభాలు ఉండవని, సమయం కలిసొస్తే తెల్ల బంగారం పంట పండి కష్టాలు పోతాయని రైతులు ఆశిస్తున్నారు.

పత్తికి ధర పెంపుతో..

ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పత్తి పంటకు మద్దతు ధర పెంచడంతో రైతులు ఉత్సాహంగా సాగు చేస్తున్నారు. దీంతో గతేడాది కంటే ఈసారి పంట



పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

విస్తీర్ణం పెరగనుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది సీజన్‌లో మండలంలో 15 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఈ ఏడాది 18 వేల ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈసారైనా పెట్టుబడులు వచ్చేనా?

అధిక పెట్టుబడులు పెట్టి పంటను అమ్ముకునే సమయంలో రైతులకు నిరాశే మిగులుతుంది. గతేడాది వర్షాలు కురవడంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. దీంతో పాటు గిట్టుబాటు ధర లేక నష్టపోవాల్సి వచ్చింది. రైతులు దళారుల బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సేకరిస్తుంది. గతేడాది సీసీఐ కేంద్రాల్లో పత్తికి మద్దతు ధర క్వింటాకు రూ.7,521గా నిర్ణయించారు. ఈసారి పత్తి మద్దతు ధర కేంద్ర ప్రభుత్వం క్వింటాకు రూ.8,111కు పెంచింది. మద్దతు ధర కేంద్రం పెంచడంతో రైతులు పత్తి సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

> **తొందరపడి నాటొద్దు**
>
> 
>
> విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి. పత్తి పంటను జూన్ నుంచి జూలై వరకు గింజలు విత్తుకోవచ్చు. 60 నుంచి 75 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన తర్వాత అదునులోనే విత్తనాలు వేసుకోవాలి. గుర్తింపు పొందిన కంపెనీ విత్తనాలను, సరైన జాగ్రత్తలు తీసుకుని సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.
>
> – పెద్ది వాసుదేవారెడ్డి, ఏఓ, రేగొండ

ప్రభుత్వ పథకాలపై కళాజాతా

కాటారం : మండలంలోని విలాసాగర్‌లో ప్రభుత్వ పథకాలు, నాసిరకం విత్తనాలు, మత్తు పదార్థాల నివారణపై కలెక్టర్, డీపీఆర్‌ఓ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కళాజాతా బృందం ఆధ్వర్యంలో ప్రదర్శన అవగాహన కల్పించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కోఆర్డినేటర్ సెగ్గెం శిరీష కళాబృందం ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, భూ భారతి, బడిబాట, సీజనల్ వ్యాధులపై పాటల రూపంలో ప్రదర్శన ఇచ్చి అవగాహన కల్పించారు. రైతులు నకిలీ విత్తనాలబారిన పడి మోసపోవద్దని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కళాజాతా బృందం సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతి సారథి కళాకారులు జాడి సుమలత, పులి రాధిక, ఆత్మకూరి మహేందర్, కమ్మల ప్రవీణ్‌కుమార్, చిలుముల మధుబాబు, గడ్డం నాగమణి, ప్రజలు పాల్గొన్నారు.



ప్రదర్శన ఇస్తున్న కళాజాతా బృందం

స్నేహితుడి కుటుంబానికి చేయూత

ములుగు రూరల్ : ములుగు జిల్లా సాక్షి రిపోర్టర్ భూక్య సునీల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా 2003–04వ సంవత్సరంలో పదో తరగతి చదివిన మిత్రబృందం బాధిత కుటుంబానికి చేయూతనిచ్చారు. సోమవారం మండలంలోని పత్తిపల్లి పంచాయతీ పరిధి కొడిశాలకుంటలో సునీల్ కుటుంబాన్ని పరామర్శించి రూ.1.36లక్షల నగదును మిత్రుడి కుమార్తె భూక్య నిత్యానందన పేరున సుకన్య సమృద్ధి యోజనలో జమ చేసి రశీదు అందించారు. సునీల్ మరణం జీర్ణించుకోలేని విషయమని మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచేందుకు తమ వంతు సాయం అందించామని పేర్కొన్నారు. సాధన స్కూల్ కరస్పాండెంట్ దుగ్గిరెడ్డి సురేందర్‌రెడ్డి మిత్రుడు సునీల్ పిల్లలకు పదో తరగతి వరకు ఉచితంగా తన పాఠశాలలో చదివిస్తానని హామీ ఇచ్చారు. పరామర్శించి వారిలో మలిశెట్టి స్వాతి, యాసం విక్రమ్‌రాజ్, దొంతిరెడ్డి రాకేష్‌రెడ్డి, మోహన్ కుమార్, సభావత్ రాజన్న, వక్కల రమేష్, ఎండీ రియాజ్, దొమ్మటి తిరుపతి, నూనేటి మధు తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న మిత్రులు

ఎస్టీయూ ఆవిర్భావ వేడుకలు

ములుగు రూరల్ : స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) 79వ ఆవిర్భావ వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సోమవారం ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు జీఓను నిలుపుదల చేయాలని కోరారు. ఈనెల చివరన విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్, పోరిక శంకర్, ఉపాధ్యక్షుడు మూడ్ కసన్‌సింగ్, కిష్టయ్య, విష్ణు, రమేష్, విజయ్, సంతోష్, రాజు, రాజుకుమార్ , రవీందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

కాటారం : వర్షాకాలం ప్రారంభం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌హెచ్‌పీ వైద్యుడు సుమన్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లిలో సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, డయేరియా సక్రమించకుండా ఉండాలంటే ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరం అని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రై డేగా పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో హెచ్‌ఈఓ స్వామి, హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య, ఏఎస్ఎం నాగరాణి, ఆశ కార్యకర్తలు సుజాత, పార్వతి, సరిత పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎస్ఎస్‌తాడ్వాయి : నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండల ఇన్‌చార్జ్ పల్లా బుచ్చయ్య అన్నారు. సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన మండల స్థాయి పదాధికారులతో 11సంవత్సరాల మోదీ ప్రభుత్వ వికసిత్ భారత్ అమృతకాలం సేవ సంక్షేమ పరిపాలన మండల కార్యశాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యదర్శి భర్తపురం నరేష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ద్యాగాల సలేందర్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంతరెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి మాదరి శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి సుభాష్, నాయకులు చెవుగాని రఘు, సుధాకర్, జీడి ప్రశాంత్, సేనాపతి, వెంకన్న, సాగర్, నాగారాజు, భిక్షపతి పాల్గొన్నారు.



ఎస్ఎస్‌తాడ్వాయి: మాట్లాడుతున్న బుచ్చయ్య

మహిళా సాధికారతే బీజేపీ ధ్యేయం

ఏటూరునాగారం : మహిళా సాధికారతే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ ఫంక్షన్ హాల్‌లో 11వ వార్షికోత్సవ వేడుకలను బీజేపీ మండల అధ్యక్షుడు వినుకోలు చక్రవర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గండెపల్లి సత్యం, ఎర్రల్ల ఎల్లయ్య, వావిలాల జనార్దన్, పలక గంగా, చంద్రారెడ్డి, దుర్గారావు, రాకేష్, అజిత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు విడతల వారీగా ఇళ్లు

- లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల : అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే ఉరుకునేది లేదని పేదలందరికి విడతల వారిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి సొంతింటి కలను నిజం చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం మండలంలోని ఒడితల, పాశిగడ్డతండా, గోపాలపూర్, కొత్తపేట, బావుసింగ్‌పల్లి, జడలపేట, వరికోల్‌పల్లి, నైన్‌పాక, అందుకుతండా, గిద్దెముత్తారం, కాల్వపల్లి, నవాబుపేట, చిట్యాల, తిరుమలాపూర్, జూకల్, చల్లగరిగ గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం రెండు గ్రామాల మినహా మిగతా గ్రామాల్లో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. గోపాలపూర్, నవాబుపేటలో నిరుపేదలకు కాకుండా అనర్హులకు ఇళ్లు మంజూరు చేశారని అక్కడి నాయకులు, ప్రజలు తెలుపడంతో పత్రాలు ఇవ్వలేదు. అలాగే మండలంలోని అందుకుతండా గ్రామంలో అనర్హులకు ఇళ్లు మంజూరు చేశారని గ్రామస్తులు ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డగించారు. దీంతో వాహనం దిగి లబ్ధిదారులతో మాట్లాడి ఎవరైనా అనర్హులు ఉంటే సంబంధిత అధికారులు గుర్తించి వారి పేర్లను తొలగించి గుడిసె ఉన్న వారికి ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

పలు అభివృద్ధి పనులకు..

మండలంలోని కొత్తపేట గ్రామంలో ఉపాధి నిధుల నుంచి మంజూరైన రూ.15లక్షలతో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి శ్మశాన వాటిక వరకు నూతగా వేసిన రోడ్డును ప్రారంభించారు. అలాగే గిద్దెముత్తారం గ్రామంలో రూ.15లక్షలతో సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే నవాబుపేట గ్రామంలో రూ.10లక్షలతో నూతంగా నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. పేదల సొంతింటి కలను నిజం చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. గుడిసెలో ఉంటుంటున్న నిరుపేదలకు మొదటి విడతలో ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పారదర్శకంగా అమలు చేయాలని, ఎక్కడ లంచాలకు ఆస్కారం లేకుండా ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం పెట్టే ప్రతి రూపాయి కూడా నిరుపేదలకు ఉపయోగపడాలని అన్నారు. గత ప్రభుత్వం ఒక్క డబుల్ బెడ్రూం కూడా ఇవ్వని ప్రతిపక్ష నాయకులు నేడు ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపనలు చేస్తుంటే ఓర్వలేక శిలాఫలకాల ధ్వంసానికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ శాఖ పీడీ లోకిలాల్, తహసీల్దార్ షేక్ ఇమామ్ బాబా, ఎంపీడీఓ జయశ్రీ, ఎంపీఓ రామకృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి–సత్యం, పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీ కృష్ణ, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు రూరల్ : రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించడంతో కలెక్టర్ దివాకర క్రీడాకారులను సోమవారం అభినందించి, సన్మానించారు. నల్లగొండ జిల్లాలో ఇటీవల జరిగిన హ్యాండ్ బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన జాడి రాధిక వరంగల్ బాలికల టీం గోల్డ్ మెడల్, వరంగల్ బాలుర టీం ఎండీ ఇమ్రాన్, జాడి వాసు సిల్వర్ మెడల్ సాధించడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడ అధికారి తుల రవి, సర్దార్‌సింగ్, లావణ్య, హ్యాండ్‌బాల్ కోచ్ పర్వతాల కుమారస్వామి, రెజ్లింగ్ కోచ్ సతీష్, సైక్లింగ్ కోచ్ శ్రీరాం పాల్గొన్నారు.

ప్రగతికాలనీ ఓట్లను 20వ వార్డులో కలపాలి

ములుగు మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో ప్రగతి కాలనీ ఓట్లను కలపాలని మాజీ వార్డు సభ్యుడు అజ్మీరా అజయ్ నాయక్ కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ సంపత్‌కు వినతిపత్రం అందజేశారు. ముందుగా కాలనీవాసులు ఆయనను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు ఎనగందుల వెంకటేష్, ప్రదీప్, సందీప్, రాజ నాయక్, ప్రవీణ్, చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీల అక్రమాలను అరికట్టాలి

- ప్రజావాణిలో ఫిర్యాదు

భూపాలపల్లి రూరల్ : గ్యాస్ సిలిండర్ల డెలివరీ సమయంలో వినియోగదారుల నుంచి అదనంగా రూ.100లు వసూలు చేస్తున్నారు.. కాగా గ్యాస్ ఏజెన్సీలపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొన్నం ప్రభాకర్‌గౌడ్, నాయకులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ.. హోటళ్లు, బేకరీల్లో కమర్షియల్ సిలిండర్లకు బదులు రెగ్యులర్ సిలిండర్లను వాడుతు వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీలతో పాటు, కుమ్మక్కైనా అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పార్టీ నాయకులు వెల్పుగొండ మహేందర్, మేకల ఓంకార్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న బీఎస్పీ నాయకులు

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్ట్

పలిమెల : తన చెల్లితో మాట్లాడొద్దని పలుమార్లు హెచ్చరించిన పట్టించుకోలేదన్న కారణంతో దాడిచేసిన వ్యక్తిపై నమోదైన హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు పలిమెల ఎస్సై జె.రమేశ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర సిరోంచ మండలం దుబ్బపల్లెకు చెందిన ఆతుకూరి దుర్గేశ్ చెల్లితో మండలంలోని ముకునూరు గ్రామానికి చెందిన కొక్కిరెక్కల నవీన్ ప్రేమ వ్యవహారం నడుస్తుంది. ఈ విషయంపై నవీన్‌ను దుర్గేశ్ తన చెల్లితో మాట్లాడొద్దని పలుమార్లు హెచ్చరించనట్లు తెలిపారు. అయినా వినకపోవడంతో కోపోద్రిక్తుడైన దుర్గేశ్ గత నెల 17వ తేదీన ముకునూర్‌లోని నవీన్ ఇంటికి వచ్చి గొడ్డలితో తలపై దాడి చేశాడు. దీంతో నవీన్ తీవ్ర గాయాలతో పడిపోయాడు. అడ్డు వచ్చిన నవీన్ చెల్లెలుపై కూడా దుర్గేశ్ దాడి చేసి అక్కడి నుంచి పారిపోయాడు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు మే 18న దుర్గేశ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం తన గ్రామానికి వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉన్న దుర్గేశ్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి గొడ్డలిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని భూపాలపల్లి కోర్టులో ప్రవేశపెట్టి జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి 'భూభారతి'



కొత్తపల్లిగోరిలో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ లక్ష్మీరాజయ్య

రేగొండ(కొత్తపల్లిగోరి) : భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి నూతన చట్టాన్ని తీసుకొచ్చిందని తహసీల్దార్ లక్ష్మీరాజయ్య అన్నారు. సోమవారం కొత్తపల్లిగోరి మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 232 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది నేత వెంకటేష్, పకిడే రాజయ్య, శ్వేత, మధు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామసభలు

మల్హర్ : మండలంలోని దబ్బగట్టు, నాచారం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ గ్రామసభలో వివిధ భూ సమస్యలపై రైతుల నుంచి 230 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. దబ్బగట్టులో 73, నాచారం గ్రామంలో 157 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఏఎస్‌ఓ శివ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

మొగుళ్లపల్లి : ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సునీత సూచించారు. సోమవారం మండలంలోని ఇస్సిపేట గ్రామంలోని రెవెన్యు సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో రైతుల నుంచి 203 దరఖాస్తులను స్వీకరించినట్లు ఆమె తెలిపారు. ఆర్డీఓ కార్యాలయ డీఏఓ రంగా, ఆర్ఐ శివరామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు. నేడు(మంగళవారం) కొర్కిశాల, బద్దంపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.



మల్హర్: దబ్బగట్టులో..



భూపాలపల్లి రూరల్: గొర్లవీడులో..

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

భూపాలపల్లి రూరల్ : భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో నిర్వహించే భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతి దరఖాస్తు వివరాలను నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో నాయబ్ తహసీల్దార్ అంజలిరెడ్డి, ఆర్‌ఐలు రామస్వామి, ఆజారొద్దీన్, సర్వేయర్ శ్రీనివాసరావు, రాజు, జూనియర్ అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: ఇస్సిపేటలో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ సునీత




కాటారం: దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగరాజు

కాటారం : భూభారతిలో భాగంగా మండలంలోని దేవరాంపల్లి, గూడూరు గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. దేవరాంపల్లిలో 172, గూడూరులో 129 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో నాయబ్ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్ఐ వెంకన్న, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విత్తన ఎంపికలో అప్రమత్తంగా ఉండాలి

ఏటూరునాగారం/వెంకటాపురం(ఎం) : రైతులు విత్తనాల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం వ్యవసాయ అధికారి శైలజ, ఏటూరునాగారం ఏఓ వేణుగోపాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏటూరునాగారం క్లస్టర్ పరిధిలోని రైతులకు, వెంకటాపురం(ఎం) మండలంలోని లక్ష్మీదేవిపేట రైతువేదికలో అవగాహన కల్పించారు. రైతులు విత్తనాలను సర్టిఫైడ్ డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని, వాటికి రశీదు కూడా పొందాలన్నారు. జూన్ చివర, జూలై మొదటి వారంలో వరినాట్లు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి శ్రీకాంత్, ఏఈఓ డయానా, రైతులు పాల్గొన్నారు.



వెంకటాపురం(ఎం): అవగాహన కల్పిస్తున్న ఏఓ